ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

1

చిత్తూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

రామచంద్రయాదవ్‌పై 27 కేసులు

● అన్నీ వైసీపీ పెట్టినవే

చిత్తూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీసీవై అధినేత బోడె రామచంద్రయాదవ్ మీద 27 కేసులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అన్నీ ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారనేవే కావడం గమనార్హం. పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని స్టేషన్లలోనూ రామచంద్రయాదవ్‌పై కేసులున్నాయి. పుంగనూరులో అత్యధికంగా 12 కేసులు, సోమలలో 5, చౌడేపల్లె, కల్లూరులో 2 చొప్పున, పలమనేరు, మదనపల్లె 1 టౌన్, 2 టౌన్, రామసముద్రం, గాజులమండ్యం, సదుం మండలాల్లో ఒక్కోటి చొప్పున కేసుల్ని నమోదు చేశారు. 2023, 2020 సంవత్సరాల్లో అత్యధికంగా 9 చొప్పున, 2022లో నాలుగు, 2024లో 6 కేసుల్ని పెట్టారు.

● రామచంద్రయాదవ్ ఆస్తులు..

ఇక, రామచంద్రయాదవ్ ఆస్తుల విషయానికొస్తే.. ఆయన పేరుతో రూ.1.30 కోట్లు, ఆయన సతీమణి సుశీలబాయ్ పేరుతో రూ.34.70 లక్షల చరాస్తులున్నాయి. స్థిరాస్తులు అయితే.. 29.30 ఎకరాల వ్యవసాయ భూములు, 36,874 చదరపు అడుగుల కమర్షియల్ స్థలం, పుంగనూరులో ఇల్లు కలిపి రూ.8.73 కోట్ల మేర ఆస్తులున్నాయి. అలాగే రూ.1.17 కోట్ల హౌస్ లోన్, రూ.21.38 లక్షలు, రూ.11.54 లక్షల చొప్పున రెండు కారు లోన్లు, రూ.11.40 లక్షలు అగ్రికల్చర్ క్రాప్ లోన్లు ఉన్నాయి.

పుంగనూరు అరాచకానికి సాక్ష్యం ఈ కేసులు

పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, బీజీవై అభ్యర్థి రామచంద్ర యాదవ్‌లపై ఉన్న కేసుల తీరును పరిశీలిస్తే పుంగనూరులో రాజకీయ అరాచకత్వం ఏ స్థాయిలో ఉందో వెల్లడవుతోంది. మంత్రి పెద్దిరెడ్డి సారథ్యంలో పనిగట్టుకుని పోలీసులు ఈ కేసులు పెట్టారనే ఆరోపణలకు బలం చేకూరుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మీద 17 కేసులు పెట్టగా, రామచంద్ర యాదవ్ మీద ఏకంగా 27 కేసుల్ని నమోదు చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ఎక్కడ రామచంద్రయాదవ్ పర్యటించినా వెంటనే పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకోవడం.. కేసులు పెట్టడం జరిగింది. అలాగే ఆయన నియోజకవర్గ ప్రజలకు కానుకల్ని పంపిణీ చేసేందుకు సిద్ధమైతే వాటిని స్వాధీనం చేసుకుని కేసులు పెట్టారు. జాబ్‌మేళా, రైతు భేరి వంటి కార్యక్రమాలను అడ్డుకుని కేసులు పెట్టారు. ఇలా ప్రతి చిన్నదానికీ రామచంద్ర యాదవ్ మీద కేసులు పెట్టారు. టీడీపీ అభ్యర్థి చల్లా బాబుతోపాటు 598 మంది టీడీపీ క్రియాశీల నేతలు, కార్యకర్తల మీద హత్యాయత్నం కేసులు పెట్టి, సుమారు వంద మంది మీద రౌడీషీట్లను తెరిచిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి మీద నమోదైన కేసుల్ని బట్టి పుంగనూరు నియోజకవర్గంలో పోలీసులు ప్రతిపక్షాల గొంతు ఏ స్థాయిలో నొక్కారో స్పష్టమవుతోంది.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న రామచంద్రయాదవ్



నామినేషన్ వేసేందుకు పుంగనూరులో ర్యాలీగా వస్తున్న రామచంద్రయాదవ్

ముగిసిన నామినేషన్ల పర్వం

మొత్తం నామినేషన్లు **275**

పార్లమెంటు స్థానానికి **51**

అసెంబ్లీ స్థానాలకు **224**

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్లు పెద్ద సంఖ్యలో వచ్చాయి. బుధవారం వరకు 180 నామినేషన్లు ఉండగా, చివరి రోజైన గురువారం రికార్డు స్థాయిలో 95 అందాయి. చిత్తూరు పార్లమెంటు స్థానానికి 51, ఏడు అసెంబ్లీ స్థానాలకు 224 వెరసి 275 నామినేషన్లు వచ్చాయి. ఇందులో చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి 51, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చిత్తూరుకు 34, గంగాధరనెల్లూరుకు 42, కుప్పంకు 32, పలమనేరుకు 21, పుంగనూరుకు 35, పూతలపట్టుకు 19, అత్యధికంగా నగరి నియోజకవర్గానికి 41 నామినేషన్లు అందాయి. గురువారం దాఖలైన నామినేషన్ల వివరాలిలా ఉన్నాయి..

● చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి టీడీపీ తరఫున దగ్గుమళ్ల ప్రసాదరావు, దగ్గుమళ్ల రాధె, విడుదలై చిరుతైగల్ కట్చి గణపతి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్.భూలక్ష్మి, కాంగ్రెస్ ఎం.జగపతి, సమాజ్‌వాది పార్టీ పల్లిపట్టు అభినవ విష్ణు, జైభారత్ నేషనల్ పార్టీ ఈఈఎం రాజ్‌కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎం.శోభ, డి.మహేష్, పి.రామయ్య, టి.నరేష్, ఎం.సుదర్శన్, ఎన్.దేవరాజులు, అగరంపల్లి పరదేశి, పి.మధు, ఎన్.గంగయ్య, ఏ.పూర్ణచంద్ర, ఎన్.భూపతి, సి.సుధాకర్, టి.మోహన్, ఎన్. చంద్రబాబు, కె.యుగంధర్, బి.రమేష్, లోకనాథం, పి.వెంకటస్వామి, జి.చిట్టిబాబు నామినేషన్లు దాఖలు చేశారు.

● గంగాధరనెల్లూరు : వైసీపీ కృపాలక్ష్మి, టి.డి.దేవరాజ్, ఆలిండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ సి. మురళి, కాంగ్రెస్ దయాల రమేష్‌బాబు, సమాజ్‌వాది పార్టీ పల్లిపట్టు గుణశేఖర్, టీడీపీ థామస్, విడుదలై చిరుతైగళ్ కట్చి ఏసు, బహుజన సమైఖ్య పార్టీ పి.భాస్కర్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎ.కృపావతి, పచ్చికాపలం రవికుమార్, కె.కరుణశ్రీ నామినేషన్లు వేశారు.

● కుప్పం : టీడీపీ నుంచి నారా చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ ఎ.గోవిందరాజులు, జైభారత్ నేషనల్ పార్టీ కె.రోజా, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వి.జగదీష్, బహుజన సమాజ్ పార్టీ గణేష్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా బి.ప్రసాద్, విడుదలై చిరుతైగళ్ కట్చి గోవిందప్ప, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నీలమ్మ, దుర్గాపద్మిని, కె.ప్రకాష్, బి.మురళీధర్, పార్థసారథి రెడ్డి, తిమ్మరాయప్ప నామినేషన్లు వేశారు.

● చిత్తూరు : కాంగ్రెస్ జి.తికారాం, వై.విశాలాక్షి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా సి.రాజ, విడుదలై చిరుతైగళ్ కట్చి వి.దేవన్, బహుజన సమాజ్ పార్టీ బి.లోకనాథం, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా వై.విశాలాక్షి, వి.పురుషోత్తం, ములగూరు అన్వేష్, సతీష్‌కుమార్, రియాజ్ బాషా, వి.రవి నామినేషన్లు వేశారు.

● పలమనేరు : వైసీపీ ఎన్.వెంకటేగౌడ, కాంగ్రెస్ బి.శివశంకర్, ఎస్.ఉష, విడుదలై చిరుతైగళ్ కట్చి సి.వినోద్‌కుమార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఎస్.బాబు బాలకృష్ణ, ఆలిండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ కొత్తపల్లి ధనరాజ్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా వి.పవిత్ర కావలి, అమర్‌నాథరెడ్డి, ఎస్.అరుణ్‌కుమార్, ఆర్.అమరనాథరెడ్డి, బొమ్మనపల్లి లక్ష్మన్న, ఎల్.దామోదర్ నాయుడు నామినేషన్లు వేశారు.

● పూతలపట్టు : టీడీపీ నుంచి కె.మురళీమోహన్, వి.తామరకన్ను, కాంగ్రెస్ ఎం.ఎస్.బాబు, సి.ప్రవీణ్‌కుమార్, వైసీపీ కె. పద్మ, జైమహిళా భారత్ పార్టీ బి.గోపాల్, పి.ఇంద్రసేన, సమాజ్‌వాది పార్టీ అమ్మారు పురుషోత్తం, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ ఎన్. శివకుమార్, భారత్ చైతన్య యువజన పార్టీ ఎన్.హరిప్రసాద్, విడుదలై చిరుతైగళ్ కట్చి ఎ.సంతోష్, జాతీయ జనసేన ఎన్. అరవింద్, నవరంగ కాంగ్రెస్ నుంచి వి.బాబు నామినేషన్లు వేశారు.

● పుంగనూరు : టీడీపీ నుంచి చల్లా రామచంద్రారెడ్డి, చల్లా పూజారెడ్డి, వైసీపీ పి.రామచంద్రారెడ్డి, పి.స్వర్ణలత, భారత చైతన్య యువజన పార్టీ బోడె రామచంద్ర, సోషల్ డెమోక్రెటిక్ పార్టీ ఆఫ్ ఇండియా షేక్ జమీర్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఫయాజ్ నామినేషన్లు వేశారు.

నేడు పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కీలకమైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరుగుతుంది. చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి కలెక్టరేట్‌లో, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల పరిశీలకులు, ఆర్వోల సమక్షంలో పరిశీలన చేపడతారు. సమగ్రంగా లేని వాటిని తిరస్కరిస్తారు. ఇక ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది. ఆ తర్వాత తుదిపోరులో ఉండే అభ్యర్థులు, పార్టీలు, గుర్తులపై స్పష్టత రానుంది. కాగా, నామినేషన్లు వేయడం పూర్తి కావడంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు.

‘మీ దరఖాస్తులు తీసుకోం’

● 400 మంది పోలీసుల ఫాం 12 తీసుకోని ఉన్నతాధికారులు


చిత్తూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటారు. దానికి సంబంధించిన ఫాం 12ను ఆయా శాఖల హెచ్‌వోడీల వద్ద ఉద్యోగులు అందించేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 26వ తేదీ వరకు గడువును పొడిగించింది. పోలీసులూ ఎన్నికల విధుల్లో ఉంటారు కాబట్టి వారికీ పోస్టల్ బ్యాలెట్ అవసరముంటుంది. జిల్లాలో 1,850 మంది అన్ని స్థాయిల్లో పోలీసులున్నారు. వారి నుంచి ఫాం 12 దరఖాస్తులు పొందేందుకు ఈనెల 23 గడువును జిల్లా పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. 1,445 మంది గడువులోగా ఫాం12 అందించారు. మిగిలిన వారంతా గురువారం జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు అందించేందుకు వచ్చారు. కానీ ఉన్నతాధికారులు దరఖాస్తులు తీసుకునేందుకు గడువు అయిపోయిందని వెనక్కి పంపించేశారు. శుక్రవారం వరకు గడువున్నా ఇలా సుమారు 400 దరఖాస్తులను తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ సర్కారు మీద తీవ్ర స్థాయిలో అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. వీలైనంత వరకు ప్రభుత్వ ఉద్యోగ ఓట్లను తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇటీవల టీచర్లకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ విషయంలోనూ అడ్డగోలు నిబంధనలతో అధికారులు గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. పుంగనూరులో దాదాపు 150 ఓట్లు, నగరి ఆర్వో కార్యాలయంలో 400 ఓట్లు చెల్లుబాటు కాకుండా గట్టి ప్రయత్నాలు జరిగాయి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ఎన్నికల సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎక్కడైనా సమస్యలు ఎదురైతే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, ఆర్ అండ్ బీ అతిథిగృహంలో అర్జీలు స్వీకరిస్తామని ఎన్నికల పరిశీలకులు తెలిపారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికల పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారు సమావేశమయ్యారు. ఎన్నికల పరిశీలకులు కైలాష్ వాంఖే, ఎండీ షాదిక్ అలాం, అమిత్‌రాజ్‌లు మాట్లాడుతూ సమస్యలను నేరుగా లేదా ఫోన్ ద్వారా తెలియజేస్తే పరిశీలిస్తామని చెప్పారు. కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ మే 12న పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. 425 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బయట, లోపల వీడియో కవరేజ్, వెబ్‌కాస్టింగ్, సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద గట్టి పోలీసు నిఘా ఏర్పాటు చేశామని వివరించారు. డీఆర్వో పుల్లయ్య, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



‘అధికారంలోకి రాగానే ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగ సమస్య తీరుస్తాం... ప్రభుత్వ బడులు బలోపేతానికి టీచర్ల పోస్టులను భర్తీ చేస్తాం’ 2018లో పలుచోట్ల జగన్ ఇచ్చిన ఈ హామీ గద్దెనెక్కాక విస్మరించి తమకు తీరని అన్యాయం చేశారని నిరుద్యోగ యువత ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. టీడీపీ పాలనలో రెండుసార్లు డీఎస్సీ నిర్వహించిందని గతాన్ని గుర్తు చేసుకుంటోంది.

\- చిత్తూరు (సెంట్రల్)

అభ్యర్థులను నిలువునా దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

నిరుద్యోగులతో జగన్ ఢీఎస్సీ

సర్దుబాటు పేరిట ఖాళీ టీచర్ పోస్టులకు ఎసరు

● ఎన్నికల వేళ కాకి లెక్కలతో డీఎస్సీ ప్రకటన

జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటన విడుదల చేస్తుందని అర్హులైన నిరుద్యోగులంతా ఎంతో ఆశగా ఎదురుచూశారు. మెగా డీఎస్సీ అనేసరికి ఆనందంతో తబ్బిబ్బయ్యారు. ఏళ్ల గడుస్తున్నా ఆ జాడే లేకపోయేసరికి తమను జగన్ వంచించారని గ్రహించారు. పోస్టులను భర్తీ చేయకపోగా వాటిని కుదించేందుకు జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో వీరంతా ఆశలు వదులుకున్నారు.

నీరుగార్చిన ప్రకటన

జగన్ సర్కార్ ఈ ఐదేళ్లలో కంటి తుడుపుగా బీఈడీ విద్యార్థులకు కేవలం రెండుసార్లు మాత్రమే టెట్ (టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు) నిర్వహించింది. 2023 తొలి అర్ధ సంవత్సరంలో, 2024 ఫిబ్రవరిలో నిర్వహించింది. ఉద్యోగాలపై ఆశతో రెండేళ్లలో దాదాపు 1,500 మంది పరీక్షలు రాశారు. అయితే ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. ఎన్నికలొస్తున్నాయనగా ఆదరాబాదరాగా డీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి భిన్నంగా తక్కువ ఖాళీలను చూపించి అభ్యర్థులను నిరాశ పరిచింది. ఇన్నాళ్లు ఎదురుచూసి వయో అర్హత కోల్పోయిన వారికి ఎలాంటి పరిమితీ పెంచలేదు. సడలింపు లేకపోవడంతో చాలామంది డీలాపడ్డారు. దీనికి తోడు అప్రంటీస్ విధానాన్ని తెరమీదకు తెచ్చేసరికి నీరుగారిపోయారు. టీచర్ ఉద్యోగం పొందాలంటే గరిష్ఠ వయో పరిమితి 44 ఏళ్లు. ఈ పరిమితి దాటిన వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమైపోయారు.

మూడువేల పోస్టులు ఖాళీ..?

జిల్లాలో ఐదేళ్లలో ఒక్క రెగ్యులర్ టీచర్‌ను కూడా నియమించలేదు. దీంతో 3 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), సబ్జెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ), హెచ్‌ఎంలు, ఎంఈవో పోస్టులున్నాయి. 2019 నుంచి ఏటా 350 మంది ఉద్యోగ విరమణ చెందుతున్నారు. ఈ ఏడాది 443 మంది రిటైర్ కానున్నారు. కానీ ప్రభుత్వం చెబుతున్న ఖాళీల సంఖ్యకూ ఈ లెక్కకూ పొంతనేలేదు. తాజా డీఎస్సీలో అంకెలగారడీ తప్ప ఖాళీ పోస్టులపై స్పష్టత లేదు.

పోస్టుల కుదింపుతో కుదుపు

డీఎస్సీ నిర్వహించేందుకు ముందుకు రాని జగన్ ప్రభుత్వం బడుల విలీనాన్ని తెరపైకి తెచ్చి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి చేతులు దులుపుకుంది. దీంతో పోస్టుల సంఖ్యకు గండి పడింది. అయినా టీచర్ల కొరత అధికం కావడంతో 2021లో 214 మందిని మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద విధుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత ఇదే డీఎస్సీలోని మరో 54 మందిని అదే ప్రాతిపదికన రిక్రూట్ చేసుకుంది. 1998 డీఎస్సీలో క్వాలిఫై అయిన 614 మందిని ఎంటీఎస్ కింద తీసుకున్నా మూణ్నాళ్ల ముచ్చటగా ఇందులో కొందరు ఇప్పటికే రిటైరయ్యారు.

ఓపెన్ స్కూల్ టెన్త్ ఫలితాల్లో ఐదో స్థానం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 25: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) గత నెలలో నిర్వహించిన టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా ఐదు, ఎనిమిది స్థానాల్లో నిలిచింది. టెన్త్‌లో 79.06, ఇంటర్మీడియట్‌లో 78.79 శాతం ఉత్తీర్ణత లభించింది. పదో తరగతిలో 1,089 మందికి గాను 861 మంది ఉత్తీర్ణులు కాగా, 228 మంది ఫెయిలయ్యారు. ఇంటర్‌లో 3,956 మందికి గాను 3,117 మంది ఉత్తీర్ణులు కాగా, 839 మంది ఫెయిలయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈనెల 29 నుంచి మే 4వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. రూ.25 అపరాధ రుసుంతో మే 6వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో మే 8 వరకు, తత్కాల్ ఫీజు కింద టెన్త్‌కు రూ.500, ఇంటర్మీడియట్‌కు 1000 రూపాయలతో మే 10వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందని విద్యాశాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ చాముండేశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పుంగనూరుకు చేరిన కేంద్ర బలగాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్25: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర సాయుధ బలగాలు(సీఆర్పీఎఫ్) పుంగనూరుకు చేరాయి. గురువారం పుంగనూరులో నామినేషన్ సందర్భంగా బందోబస్తు చేపట్టారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో కవాతు కవాతు నిర్వహించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల దాఖల సమయంలో జరిగిన హింసాత్మక ఘటనల, ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం తదితర అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రశాంత పోలింగ్‌కు కేంద్ర సాయుధ బలగాలు పంపాలని కోరారు. అలాగే ఇటీవల రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి పుంగనూరులో ప్రశాంత పోలింగ్‌కు కేంద్ర బలగాలను రప్పిస్తామని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం కేంద్ర సాయుధ బలగాలు పుంగనూరులో బసచేయడానికి ఎస్పీ మణికంఠ అంబేడ్కర్ భవన్‌ను పరిశీలించి వసతులపై ఆరాతీశారు. ఎట్టకేలకే బుధవారం వందమంది సీఆర్పీఎఫ్ పోలీసులు చేరుకున్నారు.



అధికారులూ...వీటి మాటేమిటి?

నిబంధనలకు విరుద్ధంగా సీఎం బొమ్మలతో కూడిన బోర్డులు

శాంతిపురం, ఏప్రిల్ 25 : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 40 రోజులు గడుస్తున్నా అధికార పార్టీకి చెందిన కొన్ని ప్రచార బోర్డులు అలాగే కనిపిస్తున్నాయి. శాంతిపురం మండలం చెంగుబల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కురుబూరు గ్రామ క్రాస్‌లో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనం పక్కనే ప్రభుత్వ పథకాలతో ఉన్న బోర్డులో సీఎం జగన్ బొమ్మను అలాగే వదిలేశారు. శెట్టిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కాలనీ ఇళ్ల వద్ద శిలాఫలకంలోనూ సీఎం బొమ్మ కనిపిస్తోంది. అధికారులూ...ఇవి మీకు కనిపించడం లేదా? అంటూ ప్రతిపక్షాల నేతలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



విలేజ్ క్లినిక్ భవనం వద్ద బోర్డులో.. కాలనీ ఇళ్ల శిలాఫలకంపై జగన్ బొమ్మలు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

చంద్రబాబుకు లక్ష ఓట్లు మెజారిటీయే లక్ష్యం


బీఎం గొల్లపల్లెలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 25 : చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించు కోవడమే లక్ష్యం అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం బీఎం గొల్లపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేతలు ధనంజయ, మంజునాథ్, నారాయణప్ప, మణి, శంకరప్ప, మురుగేష్, వెంకటప్ప, తిమ్మరాజుపల్లె మురుగేష్, రాధక్రిష్ణ, శ్రీనివాసులుతో పాటు మరో 50 కుటుంబాల కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా వడ్డెర సాధికార సమితి కన్వీనర్ కోళ్ల వెంకటేష్, యూనిట్ ఇన్‌చార్జి పెద్దన్న, కడపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడు బీరేష్, బూత్ కన్వీనర్ బాలక్రిష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్‌ఎస్ మణి, చంద్రప్ప, రవి పాల్గొన్నారు.

చివరిరోజు 12 నామినేషన్లు

పలమనేరు, ఏప్రిల్25 : పలమనేరులో చివరి రోజు గురువారం 12 నామినేషన్లు వచ్చాయని ఆర్‌వో దినేష్‌రెడ్డి తెలిపారు. మొత్తం నామినేషన్లు 33 అని వెల్లడించారు. ఇందులో వైసీపీ, కాంగ్రెస్, టీడీపీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, వీసీకే పార్టీ, ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ, లతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

పుంగనూరు శాసనసభకు 35 సెట్ల నామినేషన్లు

పుంగనూరు, ఏప్రిల్25: పుంగనూరు శాసనసభ ఎన్నికల్లో గురువారం 35 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు చివరి రోజు కావడంతో చల్లారామచంద్రారెడ్డి (టీడీపీ), చల్లా పూజారెడ్డి(టీడీపీ), చల్లా సుప్రియ(టీడీపీ), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ), స్వర్ణలత(వైసీపీ), బోడె రామచంద్రయాదవ్ (బీసీవైపీ), జి.మురళీమోహన్ (కాంగ్రెస్), వీ.సురేశ్(బీఎస్‌పీ), అన్వర్‌బాషా (ఎస్‌డీపీఐ), జమీర్, జి.రామయ్య, నందగోపాల్, నాగేశ్వరరావు, గోపాల్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి వసంతోత్సవం

రామకుప్పం, ఏప్రిల్ 25: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవం, త్రిశూలస్నానం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కర్ణం విశ్వనాథయ్య కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ పూజారులు ప్రజలపై పసుపునీళ్ల చల్లి ఆశీర్వదించారు. ఊరేగింపు అనంతరం ఆలయం వద్ద స్వామి, అమ్మవారి ఉత్సవర్లతో బాటు త్రిశూలానికి మంగళస్నానాలు చేయించారు. చివరిగా స్వామివారికి మహామంగళహారతి సమర్పించారు.

అత్యాచారయత్నం..నిందితుడి అరెస్టు

పుంగనూరు రూరల్, ఏప్రిల్25: బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గురువారం సీఐ రాఘవ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఓ బాలికపై అదే ప్రాంతానికి చెందిన ఆంజి(27) అత్యాచారానికి యత్నించడంతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

టీడీపీలో చేరిన గొరివిమాకులపల్లె వైసీపీ నేతలు



రామకుప్పం, ఏప్రిల్ 25: రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు కృష్ణప్ప, దొరస్వాములు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం టీడీపీ నియోజకవర్గ విస్తరణ విభాగం కన్వీనర్ డా.సురేష్‌బాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ విభాగం సభ్యుడు కన్నన్, రామకుప్పం-3 క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, గొరివిమాకులపల్లె మాజీ ఎంపీటీసీ రామిరెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, బాబూసాబ్ పాల్గొన్నారు.

దళితులపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

పలమనేరు, ఏప్రిల్25 : పలమనేరు- మదనపల్లి రోడ్డు ఐడీబీ బ్యాంకు సమీపంలో నివాస ముంటున్న భానుప్రకాష్ అనే దళితుడిని తీవ్రంగా గాయపరచి వారి కుటుంబంపై దాడికిపాల్పడిన వారిని అరెస్టు చేయాలని పలమనేరులోని మానవహక్కుల సంఘం, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు డీవీ మునిరత్నం డిమాండు చేశారు. గురువారం బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయనతో పాటు సంస్థ సభ్యులు వేలాయుధం, తదితరులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టుచేయాలని కోరారు.

జేవీవీ ఆధ్వర్యంలో జీరో షాడో డే


జీరో షాడోను చూపిస్తూ జేవీవీ ఏర్పాటుచేసిన మానవహారం

పలమనేరు, ఏప్రిల్ 25 : పలమనేరులోని ఒక ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఇక్కడి జనవిజ్ఞాన వేదిక జీరో షాడో డే సందర్భంగా మానవ హారం ఏర్పాటు చేశారు. సూర్యుడు మకర రేఖ, కర్కాట రేఖల మధ్య +23.5, -23.5 డిగ్రీల అక్షాంశాల మధ్య ఉన్నప్పుడు లేదా మనకు తలపై సూర్యుడు కేంద్రీకృతమైనప్పుడు సూర్యకిరణాలు నేరుగా భూమిని తాకుతాయి. ఆ సమయంలో మన నీడ మనకు కనపడదు. ఈ అద్భుతం గురువారం పలమనేరులో మధ్యాహ్నం 12.13 నిముషాలకు ఆవిష్కృతమైంది. ఈ అద్భుతాన్ని ఇక్కడి జనవిజ్ఞానవేదిక సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యుగంధర్‌బాబు, జిల్లా అధ్యక్షులు గిరిధరమూర్తి, ప్రధాన కార్యదర్శి బాలచైతన్య, కోశాధికారి సుదర్శనాచారి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువైన బంగారం చోరీ

గంగవరం, ఏప్రిల్ 25: గంగవరం సాయిగార్డెన్ సిటీలో సుమారు రూ.10 లక్షల విలువచేసే బంగారు చోరీకి గురైంది. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..గంగవరం సాయిగార్డెన్ సిటీలో విశ్రాంత ఉద్యోగి సంతానం తన భార్య, మనవడు, మను వరాలితో కలిసి జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి ఇంట్లో ఉక్కపోతగా ఉండడంతో ఇంటికి తాళం వేసి మిద్దెపైన నిద్రించారు. ఉదయం నిద్రలేచి చూడగా ఇంటి తాళం పగిలిపోయి ఉంది. బీరువాలోని నగలు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ చిన్న గోవిందు సిబ్బం దితో కలిసి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు చోరీకు గురైందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి వైసీపీ ర్యాలీకి జనాల తరలింపు


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

కుప్పం, ఏప్రిల్ 25: వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ ఈ నెల 24వ తేదీన కుప్పంలో నిర్వహించిన ర్యాలీకి పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి జనాలను తరలించిందని తెలుగు యువత ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు చేసిన శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వైసీపీకి భారీ ఓటమి తప్పదన్నారు. అందువల్లనే పొరుగు రాష్ట్రాల నుంచి జనాన్ని తరలించి నానాపాట్లు పడినా ర్యాలీలో జనం కనీసం ఐదు వేలకు మించలేదన్నారు. కానీ ఎక్కడో కళ్యాణదుర్గంలో జరిగిన ర్యాలీని కుప్పంలో జరిగినట్లు ఫేక్ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో వైసీపీ నేతలు పోస్ట్ చేయడంతో వారు ఓటమిని ఇప్పుడే అంగీకరించినట్లుయిందని ఎద్దేవా చేశారు. కుప్పం అభివృద్ధికోసం ఎంతో చేసిన చంద్రబాబుకు తాము విధేయులమని భరత్‌లా పెద్దిరెడ్డికి బానిసలం కాదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు మణి, వెంకటేష్, మురళి, రాజేంద్ర పాల్గొన్నారు.

కేఈసీలో రేపు మెగా జాబ్ మేళా

కుప్పం, ఏప్రిల్ 25: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, కుప్పం డిగ్రీ కళాశాలలో కుప్పం ఎడ్యు కేషనల్ సొసైటీ, బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు తెలిపారు. సుమారు వెయ్యి వరకు ఖాళీలు భర్తీ చేయబోతున్నట్లు తెలిపారు. ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. కుప్పం బస్టాండు నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వివరాలకు 9603929625, 6303912518, 9542423396 అనే ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మైనారిటీలకు ఏ కష్టం రానివ్వను: అమర్


మైనారిటీ నాయకుడిని పరామర్శిస్తున్న అమరనాథరెడ్డి , డీడీపీ లో చేరిన బీడీ కాలనీ వాసులు

పలమనేరు, ఏప్రిల్25 : మైనారిటీలకు అండగా ఉంటానని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మసీదువీధికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకులు కమాల్‌కు శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకొన్న అమరనాథరెడ్డి గురువారం ఆయన్ను రామర్శించారు. జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్, మున్సిపల్ మాజీ చైర్మన్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీశ్రేణులకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి సూచించారు. పలమనేరు టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఆర్‌వీ.బాలాజి, బ్రహ్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు ఖాజా, చాంద్‌బాషా, నాగరాజు, మదన్‌ఎ హాహన్, కోటి, సురేష్ పాల్గొన్నారు.

టీడీపీ లో చేరిన బీడీకాలనీ వాసులు

గంగవరం మండలంలోని బీడీవర్కర్స్ కాలనీ వాసులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ గంగవరం మండల నాయకులు సోమశేఖర్‌గౌడు, ప్రసాద్‌నాయుడు, బత్తి గౌడు, సురేష్‌చౌదరి, రవి, కిరణ్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ మండలాధ్య క్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, నాయకులు మాజీ ఎంపీపీ కృష్ణవేణి, జయకుమార్, భువనచంద్రగౌడు, జనసేన నాయకులు దిలీప్, సల్మాన్ పాల్గొన్నారు.

గంగవరం: గంగవరంలోని కీలపట్ల క్రాస్ వద్ద మండల టీడీపీ పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జ్‌లతో అమరనాథరెడ్డ సమావేశం నిర్వహించారు. ఎన్నికల వ్యూహాలపై పలు సూచనలు చేశారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. ● గంగవరం మండలంలో ఎంపీటీసీ సుమిత్రమ్మతో పాటు గ్రామానికి చెందిన 40 కుటుంబాలు అమరనాథరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేలుమాయి శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే అభివృద్ధి: ఆనందరెడ్డి


గ్రామవికాస సభలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఏప్రిల్ 25: విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడితేనే అభివృద్ధి జరగుతుందని ఆ పార్టీ టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి మండల పరధి గడ్డూరులో ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామవికాస సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలన ఓ చీకటి అధ్యాయమన్నారు. వైసీపీ పాలకులకు అరాచకం, దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. టీడీపీ పాలనలో అన్నివిధాలా గ్రామాలు అభివృద్ధి పథంలో నడిచాయన్నారు. తిరిగి ప్రజాపాలన రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలు చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు నందారెడ్డి, పెరుమాళ్, రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సుబ్రీ, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, చంద్ర, మురళి పాల్గొన్నారు.

పీఈఎస్‌లో ముగిసిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ



కుప్పం, ఏప్రిల్ 25: పీఈఎస్ వైద్య కళాశాలలో జరుగుతున్న వార్షిక టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. రవీస్ రెడ్ బ్యాచ్‌పై, ఆదిత్యాస్ బ్యాచ్ విజయం సాధిం చింది. బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తోపాటు మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ టైటిల్‌ను కూడా కె.ఆదిత్య దక్కించుకున్నాడు. కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు విజేతలకు ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పీఈఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరిం టెండెంట్, అధ్యాపకులు, సిబ్బంది, అన్నికోర్సుల విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛను : టీడీపీ

సోమల, ఏప్రిల్ 25: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుంటుందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నాయి.. గురువారం సోమల వీధుల్లో టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశాయి. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పీఎం మల్లికార్జున, శివశంకర్, మహేంద్రబాబు, అశోక్‌కుమార్, జనార్ధన్, రామకృష్ణ మాదిగ, సుబ్బయ్యశెట్టి, కపిల సుబ్రమణ్యం, పత్రి లక్ష్మయ్య, పాల శ్రీనివాసులు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ● ఆవులపల్లె పంచాయతీలోని గ్రామాల్లో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

రొంపిచెర్ల: మన బతుకులు మారాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో తన భర్త గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు లియాఖత్, గాలేటి సయ్యద్‌బాష, చోటా మస్తాన్, అన్వర్, ఇదాయత్, షేక్ కరీముల్లా, గౌస్‌పీర్‌ఖాన్, అంజాద్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, రామమూర్తి, ఆటో నౌషాద్ పాల్గొన్నారు.

సదుం: మండల పరిధిలోని తాటిగుంటపాళెం పంచాయతీలో చల్లా రామచంద్రారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6వేల పింఛను ఇస్తామని తెలియజేశారు.

పుంగనూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేనా మండల అధ్యక్షుడు విరూపాక్షి పేర్కొన్నారు. మండలంలోని బోడివాడిపల్లె, నేతి గుట్లపల్లె పంచాయతీల్లో జోరుగా ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు గంగాధర్, కృష్ణానాయక్, ప్రసాద్, కోలాట వెంకటరమణ, ప్రసాద్, జనసేన నాయకులు హరినాయక్, బాలాజీనాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని అప్పినేపల్లెలో బోయకొండ గంగమ్మ ట్రావెల్స్ యజమానికి రామకృష్ణనాయుడుతో పాటు ఆయన అనుచరులు 30 మంది టీడీపీలో చేరారు. అలాగే దిగువపల్లె పంచాయతీలో షికారిపాళ్యంలోని షికారిలు, ఆర్‌ఆర్.కాలనీ, యానాదిపాళ్యం, అప్పినేపల్లె, కాగతి పంచాయతీలో గుట్టకిందపల్లె నుంచి వైసీపీ నాయకులు దేవరాజు, రవి అనుచరులు మొత్తంగా 150 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి చల్లా బాబు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు బోయకొండ సుబ్బు, ప్రదీప్‌రాజు పాల్గొన్నారు. ● చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి కాటిపేరి పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు.

కల్లూరు: తన తండ్రి చల్లా రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యేగా ఒక అవకాశం కల్పించాలని ఆయన కుమార్తె చల్లా పూజారెడ్డి కోరారు. పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీలో ఆమె ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, ఆనందనాయుడు, ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు పాల్గొన్నారు.


చల్లా సమక్షంలో టీడీపీలో చేరిన చౌడేపల్లె మండల ప్రజలు


సోమలలో టీడీపీ నాయకుల ప్రచారం


సదుం మండలం తాటిగుంటపాళెంలో ఇంటింటి ప్రచారంలో చల్లా బాబు

బంగారు భవిష్యత్తు కోసం బాబును గెలిపించాలి


వడగాండ్లపల్లెలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి తదితర నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 25 : బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం చంద్రబాబును గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, మాజీ రెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని అనికెర, బ్రాహ్మణకొత్తూరు, వడగాండ్లపల్లె, బెల్లకోగిల, దళితకాలనీ, చంద్రగిరి క్రాస్ తదితర గ్రామాలలో క్లస్టర్ ఇన్‌చార్జి జాని, యూనిట్ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడగానే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకూ నెలకు రూ.1500, చదువుకునే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ.15వేలు, నిరుద్యోగ భృతి ఇస్తారని వివరించారు. ముఖ్యంగా రౌడీపాలన ఉండదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్‌ఎస్ మణి, గోపాల్, పాల్గొన్నారు.

భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాల్సిందే: ఎన్డీయే


ననియాలలో టీడీపీ నేతలకు హారతి పడుతున్న మహిళలు

రామకుప్పం, ఏప్రిల్ 25! రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే తిరిగి టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, మండల అధ్యక్షుడు వెంకటేష్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్‌లు అన్నారు. గురువారం పంద్యాలమడుగు, 89పెద్దూరు, ననియాలతాండా పంచాయతీల్లో వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుయువత మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పంలో మొత్తం 32 సెట్ల నామినేషన్లు దాఖలు

● 18 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు


చంద్రబాబు తరపున 4వ సెట్ నామినేషన్ వేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కుప్పం, ఏప్రిల్ 25: కుప్పంలో నామినేషన్ల ఘట్టం ముగిసిన గురువారం నాటికి 18 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి మొత్తం 32 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన గురువారం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నీలమ్మ, టీకే.దుర్గాపాణిని, కె.ప్రకాశ్, బి.మురళీధర్, వెంకట్రామ్ రెడ్డి పార్థసారథి రెడ్డి, తిమ్మరాయప్పలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. అలాగే పిరమిడ్ పార్టీ నుంచి డి.ప్రసాద్, బహుజన సమాజ్ పార్టీ నుంచి గణేశ్, టీడీపీ అభ్యర్థి చంద్రబాబు తరపున ఆ పార్టీ నాయకులు, విడుదలై చిరుతైగళ్ కట్చి పార్టీ తరపున గోవిందప్ప, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున వి.జగదీశ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎ.గోవిందరాజులు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా కె.రూప నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు ముగిసేసరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రబాబు 4 సెట్లు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ 4 సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల గోవిందరాజులు 3, బీఎస్పీ అభ్యర్థి గణేశ్ 2, వీసీకే పార్టీ అభ్యర్థి గోవిందప్ప 3, వైసీపీ రెబల్ అభ్యర్థి మురళీధర్ 2, స్వతంత్ర అభ్యర్థి తిమ్మరాయప్ప 2, స్వతంత్ర అభ్యర్థి నీలమ్మ 2 సెట్లు నామినేషన్లు వేశారు. వీరుగాక భారతీయ ప్రజాగళ కళ్యాణ పక్ష అభ్యర్థి అక్బర్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి రూప, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ప్రసాద్, స్వతంత్ర అభ్యర్థులుగా వైసీపీ ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ, ప్రకాశ్, నాగరాజు, రామచంద్రప్ప, సురేంద్ర కుమార్‌లు ఒక్కో సెట్టు నామినేషన్ వేశారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. పుంగనూరును అభివృద్ధి చేస్తా


ర్యాలీలో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్, నామినేషన్ సందర్భంగా బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన భారీ ర్యాలీ

- దోపిడీలు, దౌర్జన్యాలను అణిచివేస్తా
- పతంజలి పరిశ్రమతో 20 వేలమందికి ఉపాధి
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా నుంచి తరిమికొట్టాలి
- బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, ఏప్రిల్ 25: ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. గురువారం పుంగనూరులో ఆయన తన పార్టీ తరపున నామినేషన్ వేశారు. నామినేషన్ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గం 17 ఏళ్లగా దౌర్జన్యాలు, దోపిడీ, అక్రమాలు, భూదందాలు, తప్పుడు కేసులతో అరాచకాలకు నెలవుగా మారిందన్నారు. ఇక్కడి ప్రజలు పెద్దిరెడ్డిని మూడు పర్యాయాలు గెలిపించినా ఫలితం లేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి నీటి ప్రాజెక్టుల పేరుతో రైతులను మోసం చేసి కోట్లు అవినీతికి పాల్పడ్డారని, వీరి అవినీతిని ఎన్జీటీ సైతం ఎండగట్టిందని విమర్శించారు. భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, దోపిడీ, రౌడీయిజంతో పోలీసు, రెవెన్యూ అధికారుల ద్వారా ప్రతిపక్షాలు, ప్రజలను చిత్రహింసలు పెట్టిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని 18 రోజుల్లో రాజకీయంగా జిల్లా నుంచి తరమి కొట్టాలని పిలుపునిచ్చారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి పేద రైతుకు ఒక ఆవును ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి మండలంలో పాల డైయిరీ, చింతపండు, మామిడి, టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తానన్నారు. ఏడాదిలోపు పతంజలి అనుబంధ పరిశ్రమ ఏర్పాటు చేసి దాదాపు 20 వేలమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పతంజలి అధినేత రాందేవ్‌బాబా హామీ ఇచ్చారని వివరించారు. నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ, పుంగనూరులో ఉర్దూ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. పులిచెర్ల నుంచి పుంగనూరు మీదుగా బెంగళూరుకు రైల్వే లైన్ వేయిస్తానని పేర్కొన్నారు. పుంగనూరులో ట్రిపుల్ ఐటీ, షుగర్ ఫ్యాక్టరీ, 500 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని వివరించారు. అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లేందుకు ఏటా ఉచిత బస్సు సౌకర్యం, మక్కాకు వెళ్లడానికి ముస్లింలకు ప్రయాణ ఖర్చులు అందిస్తానని హామీ ఇచ్చారు.

అట్టహాసంగా భారీ ర్యాలీ

పుంగనూరు శాసనసభ ఎన్నికల్లో బీసీవై పార్టీ అభ్యర్థిగా రామచంద్ర యాదవ్ అట్టహాసంగా భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఆయన కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో, కట్టమీద వినాయకుడు, గోమాతకు పూజలు చేసి పుంగమ్మచెరువు కట్ట నుంచి జమీందారి ప్యాలెస్, నగిరి వీధి, తూర్పుమొగసాల, ఎంబీటీ రోడ్డు, ఇందిరా సర్కిల్, ప్రవేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు ర్యాలీగా చేరుకున్నారు. పట్టణంలో పలుచోట్ల భారీగా క్రేన్‌ల ద్వారా గజమాలలు, పండ్లతో స్వాగతం పలికారు. పట్టణం పచ్చదనంగా మారింది. భారీ ఎత్తున మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ ర్యాలీలో పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, చిన్నగోవిందు, సీఆర్పీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నామినేషన్ దాఖలు చేసిన రామచంద్రయాదవ్

సభ ముగియగానే రామచంద్రయాదవ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి ఆర్వో మధుసూదన్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

వైసీపీలో చేరిన శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి



పుంగనూరు, ఏప్రిల్25: రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి నూతన కాల్వ శ్రీనాథ రెడ్డి, ఆయన సతీమణి పుంగ నూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఎన్.అనీషారెడ్డి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. గురువారం పులివెం దులలో సీఎం జగన్ నివాసంలో ఎంపీ మిథున్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌రెడ్డిలతో కలసి పార్టీలో చేరారు. శ్రీనాథరెడ్డి టీడీపీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

టీడీపీ వీరాభిమాని మృతి


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, ఏప్రిల్ 25: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ ఆరిమానిపెంటకు చెందిన టీడీపీ వీరాభిమాని వెంకటేశ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నేతలు లోకేశ్, కదిరప్ప, యువరాజు, చంద్ర, బాబు, ప్రకాష్, మల్లప్ప తదితరులు వెంకటేశ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తరపున వెంకటేశ్ కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ఖర్చుపై నివేదిక

పలమనేరు, ఏప్రిల్25 : నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బి.శివశంకర్ ఈనెల 24వ తేదీ నామినేషన్ సందర్భంగా రూ.6,96,092 ఖర్చు చేసినట్టు ఆర్డీవోకు వీఎ్‌ఎటీ టీం నివేదిక అందజేసింది. నామినేషన్ సందర్భంగా వచ్చిన కార్యకర్తలు 300 మంది ధరించిన పార్టీ సింబల్ ఉన్న టీషర్టులకు గాను ఒక్కో షర్టు రూ. 300 చొప్పున రూ.1,18,800, డ్రోన్ కెమెరా వినియోగానికి రూ.6వేలు, మైకొసెట్ స్పీకర్లకు గాను రూ.25వేలు, పార్టీ సింబల్ ఫ్లాగ్స్ పెద్దవి, చిన్నవికిగాను రూ.70వేలు, ఫుడ్ ప్యాకెట్లకు గాను రూ.1,20లక్షలు, పార్టీ సింబల్ టోపీలకు గాను రూ.80వేలు ఇలా 21అంశాలకు వినియోగించిన మొత్తంరూ.6,96,092గా పేర్కొంటూ నివేదిక ఇచ్చారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.74.79 లక్షలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, ఏప్రిల్25: బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ.74.79 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం చేపట్టిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.74.79,615 నగదు, 42 గ్రాముల బంగారు, 540 గ్రాముల వెండి, యూఎస్ 5డాలర్ల నోటు ఒకటి, 1 డాలర్ల నోట్లు 2, ఒమన్ 100 బైస ఒక నోటు, కెనడా 5 సినక్యూ డాలర్ నోటు ఒకటి, 5వినగట్ డాలర్ ఒకటి, సౌదీ ఆరబ్ ఒక రియాల్ నోట్లు వచ్చాయని వారు వెల్లడించారు. 63 రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. రణబేరిగంగమ్మ ఆలయానికి రూ.53,046 నగదు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హైమావతి, బుడ్డమ్మ, భాస్కర్‌రెడ్డి, గ్రూప్ టెంపుల్స్ ఈవో చలపతి పాల్గొన్నారు.

పోలీసుల వేధింపులు తట్టుకోలేక..

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన కార్తీక్‌రెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 25 : పోలీసుల వేధింపులు తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. అడవినాథునికుంటకు చెందిన శేఖర్‌రెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి (26) గ్రామంలో చిన్న దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఒక వివాహిత మూడు రోజులుగా కనిపించడం లేదు. ఆమెతో కార్తీక్‌రెడ్డికి వివాహేతర సంబంధం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లి ఆచూకీ చెప్పాలని చితకబాదినట్లు తెలిసింది. ఈ క్రమంలో అదృశ్యమైన మహిళ బుధవారం గ్రామానికి చేరుకోవడంతో పోలీసులు అతన్ని విడుదల చేశారు. స్టేషన్‌లో పోలీసుల వేధింపులను అవమానంగా భావించిన కార్తీక్‌రెడ్డి గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం బయటకు రాకుండా పోలీసులు స్థానికంగా ఉన్న ఒక నేతతో కలిసి పంచాయితీ చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి


జయరామ నాయుడు

పూతలపట్టు, ఏప్రిల్ 25: కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అమ్మగారిపల్లె బస్టాప్ వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. వావిల్‌తోట పంచాయతీ నయనంపల్లి గ్రామానికి చెందిన జయరామ నాయుడు (70) పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో అమ్మగారిపల్లెకు బయలుదేరాడు. బస్టాప్ వద్ద వెళుతుండగా పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న తమిళనాడు రిజిస్ట్రేషన్ కల్గిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైండోవర్‌ను అతిక్రమించి మద్యం విక్రయించిన ఇద్దరికి జరిమానా


నిందితులను బైండోవర్ చేస్తున్న ఎస్‌ఐ

చౌడేపల్లె, ఏప్రిల్ 25 : బైండోవర్‌ను అతిక్రమించి మద్యం అమ్మిన ఇద్దరికి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని బత్తాలాపురానికి చెందిన సుధాకర్, మేకలచిన్నేపల్లెకు చెందిన శివమ్మ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా వారిపై పలుమార్లు కేసులు నమోదయ్యాయి. మరోకసారి కేసు నమోదైతే ఒక్కొక్కరికి రూ..50వేలు చొప్పున తహసీల్దార్ బైండోవర్ జరిమానా విధించారు. ఈ క్రమంలో సుధాకర్ ఈ ఏడాది మార్చిలో, శివమ్మ ఈ నెల 15 కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడడంతో వారికి రూ.20వేలు, రూ.16వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

సారా విక్రేత అరెస్టు

సోమల: సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ అగ్రహారంపల్లికి చెందిన సి.వెంకటరమణ ఫిబ్రవరి 22న సారా విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేసి, తహసీల్దార్‌కు బైండోవర్ చేశారు. అతను సారా విక్రయాలు కొనసాగిస్తుండడంతో గురువారం అరెస్టు చేసి, తహసీల్దార్ వద్ద హాజరుపరిచారు. అలాగే పెద్దఉప్పరపల్లెలో జల్లికట్టు నిర్వహణ విషయమై బైండోవర్‌లో ఉన్న సుబ్రమణ్యం రాజు, శ్రీనివాసులు నిబంధనలు ఉల్లంఘించడంతో అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 25: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న రామసముద్రం మండలం మినికి చెందిన ఆంజి(27)ని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఫీక్ తెలిపారు. పట్టణంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నామని, అతని నుంచి 192 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోవిందరాజుపురంలో ఏనుగుల విధ్వంసం


నేలపాలైన అరటి గెలలు

రామకుప్పం, ఏప్రిల్ 25 : మండలంలో ఏనుగుల మంద దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా బుధవారం రాత్రి మూడు ఏనుగులు బందార్లపల్లె పంచాయతీ గోవిందరాజపురం సమీప పొలాలు, తోటల్లో విధ్వంసం సృష్టించాయి. పంటలను తిన్నంత తిని ధ్వంసం చేశాయి. సుబ్రహ్మణ్యం, శంకరప్పలకు చెందిన రాగి, టమోటా పంటలను తొక్కి నాశనం చేశాయి. అనంతరం పక్కనే ఉన్న ఇనుప కమ్మీలను తొక్కి నవీన్‌రెడ్డి, ఉమాదేవిల అరటి తోటలోకి ప్రవేశించాయి. 50 చెట్లను ధ్వంసం చేశాయి. అరటి గెలలను నేలకేసి కొట్టి, ధ్వంసం చేశాయి. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల దాడులను అరికట్టాలని, పంట నష్ట పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మలేరియా రహిత జిల్లానే లక్ష్యం : డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 25: 2030 నాటికి చిత్తూరును మలేరియా రహిత జిల్లా చేయాలనే లక్ష్యం పెట్టుకున్నా మని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ అనిఫిలస్ అనే దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని, వాటిని నివారించగలిగితేనే లక్ష్యం చేరుకోగలమని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, అపోలో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు సీజ్



చిత్తూరు, ఏప్రిల్ 25 : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళుతున్న నగదును రెండో పట్టణ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు గురువారం సీజ్ చేశారు. గాంధీ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా జీడీ నెల్లూరుకు చెందిన ప్రేమ్‌కుమార్ బిల్లులు లేకుండా రూ.8,67,520 డబ్బు తీసుకెళుతుండగా పట్టుకున్నామని రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపారు.

గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష

గుడిపాల: గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1,00,400 పట్టుబడినట్లు తనిఖీ అధికారి గణపతి, ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న వాహనంలో బిల్లులు లేకుండా ఉండడంతో ఈ నగదును సీజ్ చేసినట్లు వారు చెప్పారు.


రాళ్లు విసురుతున్న వైసీపీ కార్యకర్తలు


టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

అదుపుతప్పిన ఉత్సాహం

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత

పోటాపోటీగా ఇరు పార్టీల భారీ ర్యాలీలు - నినాదాలతో తోపులాటలు

లాఠీఛార్జితో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు

ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి -పోలీసుల వైఫల్యమే కారణం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 25: ప్రశాంతంగా సాగిన నామినేషన్ల పర్వంలో చివరిరోజు ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా కార్యకర్తల నడుమ ఘర్షణ, రాళ్ళదాడి జరిగింది. పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రెచ్చిపోయిన టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి వాహనంపై కర్రలు, రాళ్ళతో దాడి చేశారు.వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని గురువారం నామినేషన్లు దాఖలు చేసేందుకు చంద్రగిరిలో భారీ ర్యాలీలు నిర్వహించారు.అక్కడి నుంచీ వాహనాల కాన్వాయ్‌తో తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రెండు పార్టీలూ పోటాపోటీగా జనసమీకరణ చేయడంతో వేలసంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. వైసీపీ అభ్యర్థి మోహిత్ తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలసి ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్ళిన కాసేపటికి టీడీపీ అభ్యర్థి నానీ కూడా లోనికి వెళ్ళారు. వెలుపల టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండడంతో వైసీపీ కార్యకర్తలు ప్రతిగా నినాదాలు చేశారు. ఈ ఉత్సాహం అదుపు తప్పడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. రాళ్ళు జెండా కర్రలతో కొట్టుకున్నారు.ఆలస్యంగా మేలుకున్న పోలీసులు లాఠీఛార్జి జరిపి టీడీపీ వర్గీయులను చెదరగొట్టారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు అప్పుడే ఆర్డీవో కార్యాలయం నుంచీ వెలుపలికి వచ్చి బయల్దేరి వెళుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై జెండా కర్రలు, రాళ్ళతో దాడి చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఆయన వెళ్ళిపోయారు. ఆ సందర్భంగా కూడా ఇరు పార్టీల కార్యకర్తలూ పరస్పరం రాళ్ళు విసురుకున్నారు. అనంతరం పులివర్తి నానీ వెలుపలికి రావడంతో ఆయన వెంట కార్యకర్తలు వెళ్ళిపోయారు. మరి కాసేపటికి మోహిత్‌రెడ్డి బయటకు రాగా వైసీపీ కార్యకర్తలు ఆయన వెంట వెళ్ళిపోవడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

ఇద్దరు అభ్యర్థులూ ఒకేసారి రావడంతో....

మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో మోహిత్‌రెడ్డి కొద్దిమంది వైసీపీ కార్యకర్తలతో కలిసి వాహనాల్లో ఎమ్మార్ పల్లి సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రాస్ బిల్డింగ్ సమీపంలో 100 మీటర్ల నియంత్రణ రేఖవద్ద పోలీసులు వైసీపీ కార్యకర్తల వాహనాలను నిలువరించి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి కారును మాత్రం ఆర్వో కార్యాలయం వద్దకు అనుమతించారు. అయితే కొందరు వైసీపీ కార్యకర్తలు ఆర్వో కార్యాలయ సమీపంలోకి చేరుకున్నారు. తరువాత కొంత సేపటికి అన్నమయ్య సర్కిల్ వైపు నుంచి టీడీపీ,బీజేపీ,జనసేన శ్రేణులతో కలసి పులివర్తి నాని ఊరేగింపుగా వచ్చారు. ఇటువైపు 100 మీటర్ల నియంత్రణ రేఖవద్ద ఉన్న పోలీసులు... అభ్యర్థితో పాటు నలుగురు మాత్రమే ఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లాలని, మిగిలిన కార్యకర్తలకు అనుమతి లేదని సూచించారు.దీంతో అన్నమయ్య కూడలి నుంచి ద్విచక్రవాహనంపై నామినేషన్ కేంద్రం వద్దకు నాని వెళ్లారు. ఆ ప్రాంతంలో ఉన్న వైసీపీ కార్యకర్తలు నానీని చూడగానే జై జగన్ అంటూ నినాదాలు ప్రారంభించారు. ఇది చూసిన టీడీపీ కార్యకర్తలు ఒక్క ఉదుటన ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని జగన్ పోవాలి... సైకిల్ రావాలి , జై నానీ అని ప్రతి నినాదాలు చేశారు. దీంతో సంయమనం కోల్పోయిన ఇరు వర్గాలూ బాహాబాహీకి దిగారు.జెండా కర్రలతో దాడులకు పూనుకున్నారు. ఈ క్రమంలో ఒకరిద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించినా ఎవ్వరూ వెనక్కు తగ్గలేదు.పరిస్థితి విషమిస్తుండడంతో పోలీసులు లాఠీచార్జి చేసి టీడీపీ శ్రేణులను చెదరగొట్టారు.మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. జరిగిన ఘటనలతో అప్పటికే ఆవేశంతో ఉన్న టీడీపీ కార్యకర్తలు చెవిరెడ్డి కారును చుట్టుముట్టారు. నినాదాలుచేస్తూ కారును నిలువరించేందుకు ప్రయత్నించారు. ఆవేదనతో జెండా కర్రలతో కారుపై దాడిచేశారు. పక్కనే రోడ్డు మరమ్మతులకోసం తెప్పించి పెట్టిన కంకర రాళ్ళతో కారుపై దాడిచేశారు. పోలీసులు వారిని అడ్డుకుని చెవిరెడ్డి కారును సురక్షితంగా పంపించివేశారు. తరువాత కూటమి కార్యకర్తలు విసిరిన గులకరాళ్లతో వైసీపీ కార్యకర్తలు దాడికి దిగడంతో యుద్ధవాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు కష్టమ్మీద ఇరు వర్గాలను అడ్డుకుని దాడులు తీవ్రతరం కాకుండా నిలువరించారు.తరువాత 2 గంటలకు పులివర్తి నాని నామినేషన్ ముగించుకుని ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేస్తూ కొంతసేపు అక్కడే ఉండి ఆ తరువాత అక్కడి నుంచి బయలుదేరారు.ఆయనతో పాటే కార్యకర్తలు కూడా అక్కడినుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం సుమారు 2.20 గంటల సమయంలో వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి నామినేషన్ ముగించుకుని ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చి తన అనుచరులతో కలిసి వెళ్లిపోయారు.

అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు : నాని

తన నామినేషన్‌ను అడ్డుకునేందుకు చెవిరెడ్డి, ఆయన వర్గీయులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని, తమ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని నామినేషన్ తరువాత పులివర్తి నాని మీడియాకు చెప్పారు. మంచి ముహూర్తం ఉన్నందున చివరిరోజున ప్రధాన నామినేషన్ వేస్తానని తాను మొదటి రోజే చెప్పానని, అయితే వారు మూడు తేదీలు, సమయాలు మార్చుకుని తాను నిర్ణయించుకున్న సమయానికే నామినేషన్ పెట్టుకున్నారన్నారు. ఇది కాకతాళీయం కాదని గొడవ చేయాలనే తలంపుతో ప్రణాళిక ప్రకారం చేశారని ఆరోపించారు. ఓడిపోతున్నామనే అక్కసుతోనే చెవిరెడ్డి ఈ దాడులు చేయిస్తున్నారన్నారు. వారెన్ని దాడులు చేసినా తాము ఆవేశపడేది లేదని, ఎన్నికలయ్యేవరకు సంయమనంతో వ్యవహరిస్తామని ఆయన చెప్పారు. ఐతే ఈ దాడులపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ముందుగానే తెలిసినా...

ఇద్దరు అభ్యర్థులు చివరి రోజునే, ఒకే సమయంలో నామినేషన్‌కు వస్తారని తెలిసినా పోలీసులు తగినవిధంగా బందోబస్తు చర్యలు చేపట్టకపోవడమే ఈ ఉద్రిక్తతలకు కారణంగా కనబడుతోంది. రెండు ప్రధాన పార్టీలు, పెద్దసంఖ్యలో కార్యకర్తల బలమున్న పార్టీలు నామినేషన్‌కు ర్యాలీగా తరలి రానున్న నేపథ్యంలో అందుకు తగినట్టు పోలీసు బలగాలను కూడా పెద్దసంఖ్యలో మోహరించాల్సి ఉంది. ఆ మేరకు బలగాలు లేకపోవడంతో ఇరు పార్టీల కార్యకర్తలు కలబడి దాడులు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆర్వో కార్యాలయ మార్గంలో గులక రాళ్ల గుట్టలు ప్రమాదకరంగా మారుతాయని పోలీసులు గుర్తించలేకపోయారు.వీటిని ముందుగానే పరిగణనలోకి తీసుకోకపోవడం, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వంటి పోలీసు వైఫల్యాలతోనే ఆర్డీవో కార్యాలయం వద్ద ఘర్షణ జరిగింది.

బేల్దార్ హత్య


మృతుడు ఆసీఫ్

చిత్తూరు, ఏప్రిల్ 25: నగరంలో గురువారం రాత్రి బేల్దార్ హత్యకు గురయ్యాడు. తనతో పనిచేసేవారు ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తితో పొడిచి పారిపోయారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... కేరళకు చెందిన ఆసీఫ్, హైదరాబాదుకు చెందిన నసీమాను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు నెలల క్రితం నగరంలోని తోటపాళ్యంలో ఓ అద్దె ఇంటిలో చేరారు. ఆసీఫ్ బేల్దార్ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి ఆసిఫ్ తనతోపాటు పనిచేసే బద్రి, పవన్‌తో కలిసి ఓబనపల్లె మద్యం షాపు వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తూ పవన్ తీసుకొచ్చిన కొత్త ఫోన్‌లో మాట్లాడాలని ముగ్గురు వాదులాడుకున్నారు. ఈ క్రమంలో ఆసిఫ్ బద్రి వద్ద ఉన్న ఫోన్‌ను లాక్కొని ఇంటికి వెళ్లిపోయాడు. ఫోన్ తీసివ్వమని పవన్ బద్రిని నిలదీశాడు. ఇద్దరూ కలసి ఆటోలో తోటపాళ్యం చేరుకున్నారు. ఇంట్లో ఉన్న ఆసిఫ్‌ను బయటకు పిలిచి ఫోన్ ఇవ్వమని నిలదీశారు. ఇవ్వకపోవడంతో పవన్, బద్రి కలసి బీర్ బాటిల్‌తో ఆసిఫ్ తలపై దాడి చేసి, పరారయ్యారు. ఈ దాడిలో ఆసిఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సీఐ ఉలసయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారు చెప్పిన సమాచారం మేరకు బద్రియే హత్య చేశాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బద్రిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ వార్డుమెంబరు


శ్యామలమ్మకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న విశ్వనాథ్

రామకుప్పం, ఏప్రిల్ 25: రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగుకు చెందిన వైసీపీ వార్డు మెంబరు శ్యామలమ్మ, వైసీపీ నేత రాగప్పలు టీడీపీలో చేరారు. గురువారం రాత్రి వారికి తెలుగుయువత మండలాధ్యక్షుడు విశ్వనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గంటప్పగౌడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులుగౌడు, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్, సీజీగంటప్ప, ఉమేష్‌గౌడు, మురుగేష్ పాల్గొన్నారు.

చిన్నారులతో కవ్వింపు చర్యలా?

● వైసీపీ తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం



రామకుప్పం, ఏప్రిల్ 25: టీడీపీ నేతలు ప్రచారానికి వచ్చేదారిలో చిన్నారులు వైసీపీ టీ షర్టులు ధరించి, జెండాలు ఊపుతూ కనిపించారు. ఇలా కవ్వింపు చర్యలకు వైసీపీ నేతలు చిన్నారులను వాడుకోవడం బాధాకరమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఈ ఘటన గురువారం ఉదయం రామకుప్పం మండలంలో చోటుచేసుకుంది. పంద్యాలమడుగు గ్రామంలో టీడీపీ శ్రేణులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. అక్కడ్నుంచి పల్లికుప్పం మీదుగా కవ్వంపల్లెకు బయలుదేరారు. పల్లికుప్పం మూడు రోడ్ల కూడలి వద్దకు వీరు రాగానే.. చిన్నారులు వైసీపీ జెండాలు ఊపుతూ సందడి చేశారు. టీడీపీ కార్యకర్తలు వారిని ఫొటోలు తీస్తుండగా కొందరు వెళ్లిపోయారు. తాము ప్రచారానికి వచ్చిన సందర్భంలోనే చిన్నారులను ఇలా కూడలిలో నిలబెట్టడం వైసీపీ శ్రేణులకు తగదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఆ చిన్నారుల్లో ఎక్కువ మంది ఆ పార్టీ క్రియాశీల కార్యకర్తల కుమారులేనని తెలిపారు. ఇలా కవ్వింపు చర్యలకు చిన్నారులను పావులుగా వాడుకోవడం పద్ధతి కాదన్నారు.

హామీలకు కట్టుబడి ఉంటాం..

● ముస్లింల హక్కుల పరిరక్షణకు కృషి ● రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తాం

● చిత్తూరు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు


ముస్లిం మైనారిటీల మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 25: చిత్తూరు నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ స్పష్టం చేశారు. గురువారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో 'హర్ ముస్లిం టీడీపీ-బీజేపీకే సాత్' అనే మ్యానిఫెస్టోను విడుదల చేశారు. దగ్గుమళ్ల మాట్లాడుతూ 'గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించింది. వారి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసింది. టీడీపీ బీజేపీతో పొత్తుపెట్టుకున్నందుకు ముస్లింలలో అభద్రతా భావాన్ని కల్పించేందుకు వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ముస్లింలు కూటమి వైపు వస్తున్నారనే అక్కసుతో వైసీపీ లేనిపోని అపోహలు సృష్టిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింలకున్న 4 శాతం రిజర్వేషన్లను కొనసాగిస్తాం, సీఏఏ (సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్) నిబంధనలను సడలిస్తాం. గత టీడీపీ ప్రభుత్వంలో మసీదుల మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కోసం రూ.35.94 కోట్లు ఖర్చు చేయగా, వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.కోటి మాత్రమే ఖర్చు చేసింది. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రంజాన్ తోఫా, స్వయం ఉపాధి పథకాల అమలు, దుల్హన్ పథకం, ఫైనాన్స్ కార్పొరేషన్లకు నిధుల మంజూరు, ఇమాం, మౌజన్లకు వేతనాలు తదితరాలను పూర్తిగా నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం' అని దగ్గుమళ్ల అన్నారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ముస్లిం విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తాం. ఉర్దూ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం. చిత్తూరులో ఈద్గా నిర్మాణంతోపాటు సౌకర్యాలు కల్పిస్తాం. ఇళ్లు లేని పేద ముస్లిం మహిళలకు ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలాలు కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాం. మండల కేంద్రాల్లో గార్మెంట్ సంస్థ ఏర్పాటు చేసి ముస్లిం యువతకు, మహిళలకు ఉద్యోగ కల్పన చేస్తాం. స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పిస్తాం. ఇవిగాక పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన మేరకు ముస్లింల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్‌లో రూ.1,000 నుంచి రూ.1,500 కోట్లు కేటాయిస్తాం. సబ్సిడీతో కూడిన రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తాం. అని గురజాల చెప్పారు. అనంతరం ముస్లిం మైనారిటీలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీకి చెందిన ఖాజీ అబ్దుల్ మాలిక్‌ను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ముస్లిం మైనార్టీ నేతలు అత్తుబాయ్, సర్దార్, అన్సర్, జాఫర్, గౌస్, మహబూబ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

REALESTATE
స్మార్ట్ సిటీ తిరుపతి జిల్లా ప్రతి ఏరియాలో మీకు లాండ్స్, బైపాస్ కమర్షియల్ ప్లాట్స్, ఓపెన్ ఫ్లాట్స్ తీసి ఇవ్వబడును & మీ ఫ్లాట్స్ అమ్మించ బడును (చెర్లోపల్లి, మంగాపురం, చంద్రగిరి, తొండవాడ, రామానుజపల్లి, వేదాంతపురం, చిగురువాడ, రామాపురం, తనపల్లి, తిరుచానూరు, బ్రాహ్మణపట్టు, రేణిగుంట, ఎయిర్‌పోర్ట్, మంగళం, ఏర్పేడు) Cont. : 7997461827
AJT - 6320

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించు 7382114647
AJA- 176988


TOURS & TRAVELS
తేది: 15/05 గోవా టూర్ 7 రో॥ 9 వేలు, తేదీ: 25/05 కేరళ యాత్ర 7 రో॥ 9 వేలు, 2x2 లగ్జరి బస్సు, టీ, టిఫిన్, శాఖాహార భోజనం. సంకల టూర్స్, తిరుపతి, 77308 10126.
AJT- 179935

CHANGE OF NAME
I, THUMBA SUJATHA(Old Name), W/o Thumba Praveen, residing at D.No. 4-38/B, Thumbavaripalle, Village, Erra cheruvupalle Post, Puthalpattu Mandal, Chittoor Dist, AP hereby declare that I have changed my name as THUMBA REDDY SUJATHA(New Name) for all purposes
AJT - 4423

WANTED
Wanted Teachers Pre Primary, Primary, Higher for All subjects, Hostel wardens, P.E.T, Computer faculty, Attractive salary.S.N. Puram, TIRUPATI - 92908 98331, 70138 81383.
AJT - 6303

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఎక్కే గడప ... దిగే గడప!



ఇదీ సంగతి


రాష్ట్ర మంత్రి రోజా ఎక్కే గడప దిగే గడపతో సతమతమవుతున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కీలక నాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆమె అలెర్ట్ అయ్యారు. అసమ్మతి వర్గ నేతల పట్ల ఇప్పటిదాకా ఉన్న బింకాన్ని సడలించుకుని వారి ఇళ్లకు తిరుగుతున్నారు. ఏలుమలై మొదలియార్ వర్గానికే చెందిన వైసీపీ నేత నారాయణబాబు ఇంటికి వెళ్లి తనకు సహకరించాలని రోజా కోరారు. అలాగే విజయపురం మండలానికి చెందిన అసమ్మతి నాయకుడు లక్ష్మీపతి రాజును కలిసేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. బుధవారం నగరి మున్సిపాలిటీకి చెందిన మొదలియార్ సామాజికవర్గంలో కీలక నాయకుడు పురుషోత్తం మొదలియార్‌ను ఆయన ఇంట్లోనే కలిశారు. అదే రోజు మధ్యాహ్నం నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ ఇంటి గడప తొక్కారు. 'ఇప్పటి వరకు జరిగిందేదో జరిగిపోయింది...ఈ ఎన్నికల్లో నాకు సహకరించండి' అంటూ వారందరినీ కోరుతున్నట్లు సమాచారం. అయితే వెళ్లిన ప్రతిచోటా సానుకూలత లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. రెండు వారాల క్రితం తిరుపతిలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డిని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిసింది. 'జరగాల్సిన నష్టం జరిగిపోయాక ఇప్పుడు గడప గడపకు తిరిగి లాభం ఏమిటి' అనే నిట్టూర్పులు వైసీపీ వర్గాల్లోనే వినిపిస్తుండడం విశేషం.

- పుత్తూరు అర్బన్

బీ-ఫారం.. ఏ-ఫారం అంటే..!

● మీకు తెలుసా ?

ఎన్నికల సమయంలో తరచూ ఏ-ఫారం, బీ-ఫారం అనే పదాలు వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వీరే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ, ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందజేస్తారు. నామినేషన్ నామినేషన్ పత్రంతోపాటైనా లేదా పరిశీలన సమయంలోనైనా రిటర్నింగ్ అధికారికి బీ-ఫారం అందించాలి. ఇలా బీ-ఫారం సమర్పించిన అభ్యర్థికే ఎన్నికల కమిషను ఆ పార్టీల గుర్తులను కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తారు.



● ఇక, పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారం అందిస్తారు. బీ ఫారం ఇచ్చే అధికారాన్ని ఆ ప్రతినిధికి అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారం తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారం ఇచ్చినట్లు స్పష్టం చేయాలి.

- చిత్తూరు కలెక్టరేట్

● నోట్ దిస్ పాయింట్

● 2009 నియోజకవర్గాల పునర్విభజనతో కొత్తగా ఏర్పడిన నియోజకవర్గాలు: పూతలపట్టు, జీడీనెల్లూరు

● అంతరించి పోయినవి: పుత్తూరు, వేపంజేరి

నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. నగరి, విజయపురం, నిండ్ర మండలాలు చిత్తూరు జిల్లాలో, పుత్తూరు, వడమాలపేట తిరుపతి జిల్లాలో ఉన్నాయి. కానీ, నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ బాధ్యత పూర్తిగా చిత్తూరు కలెక్టర్‌దే.

● హెచ్చరిక



రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే

కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం 1951 సెక్షన్ 125, ఐసీపీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171ఇ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- చిత్తూరు



జగన్ బటన్ నొక్కితే జనం అకౌంట్లలో కాసులు పడుతున్నాయో లేదో కానీ.. గ్రామాలు మాత్రం ఆయన ఐదేళ్ల పాలనలో బీడుపడ్డాయి. పంచాయతీ నిధులు పక్కదారి పట్టగా, కనీసమైన సదుపాయాలకు, సౌకర్యాలకు నోచుకోక అలో లక్ష్మణా అంటూ ఆవేదన చెందుతున్నాయి. పొరుగు రాష్ట్రాల గ్రామాలతో పోలిస్తే ఏపీ గ్రామాలు నిజంగానే ఎడారులను తలపిస్తున్నాయి. కరెంటు లేక పొలాలు బీళ్లు పడితే, తాగేనీళ్లు లేక ప్రజల గొంతులు ఎండుతున్నాయి. వీధులు, మురుగునీటి కాలువలు, వీధి లైట్లు.. అన్నింటికీ అన్ని సదుపాయాలూ పొరుగు రాష్ట్రాలతో చూస్తే తీసికట్టుగా ఉంది. మూడు రాష్ట్రాల కూడలిలోని కుప్పం నియోజకవర్గంలోని ఎంకేపురాన్ని.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని వేపనపల్లె, బెండవారం గ్రామాలను 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ మూడు గ్రామాల్లోని సదుపాయాలు, సౌకర్యాలు, సమస్యలను పోలుస్తూ ఇస్తున్న సచిత్ర కథనమిది. - కుప్పం

సిగ్గు పడాలా.. వద్దా?

'పొరుగు'ముందు తలవంపులు!

● ఇతర రాష్ట్రాల గ్రామాల ముందు ఏపీ గ్రామం తీసికట్టు ● సదుపాయాలు, సౌకర్యాలు సున్నా



తాగునీటి కష్టం : ఊళ్లోని బోరునుంచి వస్తున్న తాగునీళ్లు ఏమాత్రం చాలడంలేదు. కనీసం పైపు లైన్లు వేసే దిక్కు లేదు. పంచాయతీ పాలకులను, అధికారులను అడిగి అడిగి విసిగిపోయిన ప్రధాన వీధిలోని సుమారు పది కుటుంబాలు ఏడాది కిందట దాదాపు రూ.10 వేలు సొంత నిధులు ఖర్చు చేసి పైపులైన్ వేయించుకున్నాయి. డబ్బు, శ్రమ వృథానే తప్ప వీరిదాకా నీళ్లు రావడంలేదు. దీంతో రచ్చబండ దగ్గర ఉన్న బోరునుంచి నీటిని బిందెల ద్వారా మోసుకొస్తున్నారు.



ఎంకే పురం (ఆంధ్రప్రదేశ్)

మండల కేంద్రమైన శాంతిపురానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కేంద్రమిది. కనీసం గ్రామం పేరును సూచించే బోర్డు లేదిక్కడ. పాత పంచాయతీ భవనంమీద రాతను చూసి ఇది ఎంకేపురం అని తెలుసుకోవాలి. ఈ గ్రామాన్ని పరిశీలిస్తే..

శుద్ధ జలం ఏదీ? : టీడీపీ హయాంలో ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ఒక ట్యాంక్ ఏర్పాటు చేసి రూ.2కే గ్రామమంతా శుద్ధ జలం సరఫరా చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ ట్యాంకు మూలన పడింది. తుప్పు పట్టిన ఈ ప్లాంటు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి.



విద్యుత్తు సరఫరా దారుణం

కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు కోతలు విధిస్తారో తెలియని పరిస్థితి. అన్ని విద్యుత్తు స్తంభాలకు లైట్లున్నా.. ముప్పావువంతు వెలగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు చెప్పినా లైట్లు మార్చలేదన్నారు.



మురుగుకంపు : గ్రామం ముఖద్వారంలో అతిపెద్ద మురుగునీటి కాలువ కనీసమైన నిర్వహణ లేక కంపు కొడుతోంది. ఈ కాలువను ఊరి చెరువులో కలిపారు. ఇక గ్రామం లోపలి కాలువలు చాలావరకు ధ్వంసమయ్యాయి. ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. అంటువ్యాధులకు కారణమవుతోంది.



అసంపూర్తిగా కమ్యూనిటీ హాలు

టీడీపీ హయాంలో నిర్మాణం మొదలు పెట్టిన కమ్యూనిటీ హాలును వైసీపీ ప్రభుత్వం అలాగే వదిలేసింది. ప్రస్తుతం ఈ అసంపూర్తి భవనాన్ని గ్రామస్థులు పశువులు కట్టుకోవడానికి, ట్రాక్టర్లు నిలబెట్టుకోవడానికి, గడ్డి మోపులు పెట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు.



వీధులు అధ్వానం

గ్రామంలోని చాలావరకు సిమెంటు రోడ్లు లేవు. గుంతలు మిట్టలుగా ఉన్న మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. కొన్ని వీధులకు ఎప్పుడో వేసిన సిమెంటు రోడ్లు కంకర తేలాయి.



ఈ రోడ్లనూ పట్టించుకునే దిక్కేది?

గ్రామంలోని రోడ్లే కాదు.. ఎంకేపురాన్ని మండల కేంద్రమైన శాంతిపురంతో అనుసంధానం చేసే తారు రోడ్డు చాలా చోట్ల గుంతలు పడి, ప్యాచ్‌లతో దారుణంగా ఉంది. కర్ణాటక సరిహద్దు రాయికి ఇవతల మన ఏపీ రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. గుంతలు తేలి, దుమ్ము రేగుతూ ఉంది.



బెండవారం (కర్ణాటక)

కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకాలోని పంచాయతీ కేంద్రమిది. శాంతిపురం మండలం ఎంకే పురం పంచాయతీకి కేవలం ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉంది. సరిహద్దు అవతల ఉన్న ఈ గ్రామంలో అన్ని సదుపాయలతో ప్రజలు జీవనం సాగిస్తున్నారు.



ప్రతి ఇంటి ముందూ కొళాయిలు

వీధివీధినా పైపులైన్లు వేసి ఇంటింటికీ కొళాయి పెట్టారు. రోజులో రెండు సార్లు.. రెండుమూడు గంటలపాటు నీళ్లు వదులుతున్నారు. ప్రస్తుతమైతే నేరుగా బోరునుంచే పైపులైన్లు వేశారు. రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇది అందుబాటులోకి వస్తే 24 గంటలూ తాగునీరు అందుతుందని స్థానికులు తెలిపారు.

అందుబాటులో శుద్ధ జలం

పంచాయతీ మధ్యలోనే శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేసి రూ.5కు 20 లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎప్పుడు వెళ్లినా నీళ్లు అందుబాటులో ఉంటున్నాయి. ప్రభుత్వాలు మారినా శుద్ధ జలం ప్లాంటు నిర్వహణను విస్మరించడంలేదు.





ఎటు చూసినా సిమెంటు రోడ్లు, కాలువలు

గ్రామంలోని అన్నీ సిమెంటు రోడ్లే. అవి కూడా శుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి వీధికీ సిమెంటు కాలువలు నిర్మించారు. అక్కడక్కడా కొద్దిగా కాలువల్లో చెత్త కనిపిస్తున్నా, ఆ చెత్త అడ్డు పడే పరిమాణానికి పెరిగే సమయానికి పంచాయతీ వారు శుభ్రం చేసేస్తారని స్థానికులు తెలిపారు. ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండటం లేదు.



24 గంటలూ విద్యుత్తు సరఫరా

గ్రామానికి 24 గంటలూ విద్యుత్తు సరఫరా అవుతోంది. నాలుగుచోట్ల ప్రధాన కూడళ్లలో స్పన్ పోల్స్ ఏర్పాటు చేసి ఎనిమిదేసి పెద్ద డూమ్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇవిగాక వీధుల్లోని విద్యుత్తు స్తంభాలకూ లైట్లు అమర్చారు. వీటి వెలుగుల్లో గ్రామం కాంతులీనుతోంది.

రహదారులు బాగున్నాయ్

తాలూకాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు.. పొరుగు రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రోడ్ల నిర్వహణ బాగుంది. గుంతలు, డ్యామేజీ కనిపించడంలేదు.





వేపనపల్లె (తమిళనాడు)

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి తాలూకాలోని పంచాయతీ కేంద్రం వేపనపల్లె. కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది చిన్న పట్టణంగా అభివృద్ధి చెందిన ఈ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అన్నీ అమరాయి.

శుద్ధ జలమూ ఉంది

గ్రామానికి రెండు శుద్ధ జలం ప్లాంట్లు ఉన్నాయి. రూ.5కే 20 లీటర్ల నీటిని అందిస్తున్నారు. రోజులో ఎప్పుడు వెళ్లినా నీళ్లు అందుబాటులో ఉంటోంది. ఈ రెండు పాంట్లలో ఒకటి రెండు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. త్వరలోనే బాగుచేసి అందుబాటులోకి తెస్తారని గ్రామస్తులు అక్కడి పంచాయతీ పాలకుల తీరుపై విశ్వాసం వ్యక్తం చేయడం విశేషం.





కొళాయి తిప్పితే నీళ్లే

గ్రామంలోని ప్రతి ఇంటి ముందూ కొళాయి ఏర్పాటు చేశారు. రెండు ఇళ్ల మధ్య ఐదారు అడుగుల దూరమున్నా రెండు కొళాయిల ఉంటాయి. ప్రత్యేకంగా రక్షిత మంచినీటి ట్యాంకు ద్వారా 24 గంటలపాటూ తాగునీరు సరఫరా అవుతుంది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ.. సిమెంటు రోడ్లు



వేపనపల్లెలో మురుగునీటి కాలువలు నిర్మించి దానిపై ప్లేట్లు వేసి మూసేశారు. ఆపైన వీధులలో రోడ్లు వేశారు. అక్కడక్కడా మ్యాన్ హోల్స్ పెట్టారు. ఎక్కడైనా మురుగు నిలిచిపోతే ఈ హోల్స్‌ను తెరచి శుభ్రం చేస్తారన్న మాట. ఇంకా కొన్నిచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు కావాల్సి ఉంది. అలాంటి చోట మాత్రం కొద్దిగా పారిశుధ్యం క్రమం తప్పింది. ఇక, గ్రామ వీధులన్నీ సిమెంటు రోడ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజలు కూడా ఇళ్ల ముందు రోడ్లలో చెత్తాచెదారం పడకుండా శుభ్రంగా ఉంచుకుంటున్నారు.

ఇక్కడా 24 గంటల విద్యుత్తు

గ్రామంలో విద్యుత్తు సరఫరా 24 గంటలూ ఉంటోంది. వీధి లైట్లు ఏర్పాటు చేయడం తక్కువే. ఇవి రిపేరైతే మాత్రం వెంటనే మరమ్మతులు చేయిస్తున్నారు.



చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



పాలసముద్రం, ఏప్రిల్ 25: మండలంలోని ఆముదాలలో వున్న ద్రౌపదీ ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపదీ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ద్రౌపదీ కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి రాణిరెడ్డిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎం. సురేష్ అన్నదానం చేశారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 200 కుటుంబాలు



బంగారుపాళ్యం, ఏప్రిల్ 25: తగ్గువారిపల్లె పంచాయతీకి చెందిన 200 వైసీపీ కుటుంబాలు మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, ఉపాధ్యక్షుడు లోకనాథం నాయుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు హేమచంద్రనాయుడు ఆధ్వర్యంలో గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో తగ్గువారిపల్లె మాజీ సర్పంచ్ అంబికమ్మ, ఆమె అనుచరులు, వార్డు సభ్యులున్నారు. అలాగే కూర్మాయిపల్లి పంచాయతీలో మాజీ జడ్పీటీసీ కళావతి, ఏపీ కల్లుగీత కార్మిక మాజీ డైరెక్టర్ మహేంద్ర ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, రవి, లోకేష్ రెడ్డి, కుప్పిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీరామపురంలో సూపర్ సిక్స్ పథకాల ప్రచారం

నిండ్ర, ఏప్రిల్ 25: మండలంలోని శ్రీరామపురం పంచాయతీలో గురువారం తెలుగు మహిళలు ఇంటింటికి వెళ్లి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్, ఎంపీ అభ్యర్థి దగ్గమల్ల ప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి నిరోషా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 సిలిండర్లు ఉచితం తదితర సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. నగరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సంపూర్ణమ్మ, బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షురాలు భువనేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

గాలి భానుప్రకాష్ తరపున నామినేషన్ దాఖలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25: నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ తరపున పుత్తూరుకు చెందిన ఆ పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో ఒక సెట్ నామినేషన్ పత్రాలను గురువారం నగరిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో గాలి భానుప్రకాష్ తరపున మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై (అమ్ములు), పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్‌తో కలిసి పత్రాలను సమర్పించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు కైలాష్ వాంఖడే

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25: మున్సిపల్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు కైలాష్ వాంఖడే గురువారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ ఎన్ రెడ్డితో కలిసి 53, 54, 55 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు ర్యాంప్‌ల ఏర్పాటును పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, బీఎల్‌వోలు ఉన్నారు.

వైభవంగా వడయాత్తు ఉత్సవం



స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 25: నగరంలోని కోదండరామాలయంలో గురువారం ధ్వజా అవరోహణంతో శ్రీరామనవమి ఉత్సవాలను ముగించారు. ఈ సందర్భంగా స్వామివారి సుదర్శన చక్రానికి స్నానం చేయించి పతాకాన్ని దింపారు. సాయంత్రం చిత్తూరు మాజీ ఎంపీ డి.కె.ఆదికేశవులునాయుడు కుటుంబసభ్యుల ఉభయంతో స్వామి అమ్మవార్లకు వడయాత్తు ఉత్సవం నిర్వహించారు. ఉభయదారులతో పాటు ఈవో సుబ్రమణ్యంనాయుడు, అర్చకులు వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ చెంగల్‌రాయులు, ఆలయ సిబ్బంది, దేవాదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం



బాలవికాష్ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 25: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బాలవికాష్ సంస్థ గురువులచే వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణ కార్యక్రమాల్లో చిన్నారులకు విలువలతో కూడిన విద్య, భజన, ఆటలు, చిత్రలేఖనం, నీతికథలు, వ్యాయమం, సంగీతం, పద్యాలు, భగవద్గీత తదితర అంశాలపై 11 రోజులు పాటు గిరింపేట సత్యసాయి సంస్థాన్, కొంగారెడ్డిపల్లె ఉషానగర్ కాలనీ బాలవికాష్ కేంద్రాల్లో గురువులచే శిక్షణ స్తున్నామని జిల్లా అధ్యక్షుడు ఎస్. మధుసూదనం తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.పాండురంగం, నగర కన్వీనర్ ఆర్. శేషనారాయణ, గజేంద్రెడ్డి, శ్రీ కంతయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తపోవనం ఉన్నత పాఠశాలలో జిల్లా బాలభవన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, బొమ్మల తయారీ, పెయింటింగ్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు రామచంద్రారెడ్డి తెలియజేశారు.

నేటి నుంచి గరికపాటి ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్ : నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారంనుంచి ఈనెల 28వ తేది వరకు చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో భక్త చింతామణి శతకంపై డాక్టర్ గరికపాటి ప్రవచన కార్యక్రమాలు ప్రతిరోజూ సాయంత్రం 6నుంచి 8.30 గంటల వరకు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కూటమి అభ్యర్థులకే యాదవుల మద్దతు





గురజాల జగన్మోహన్‌ను సన్మానిస్తున్న అఖిల భారత యాదవ సంఘం నేతలు, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రతిమ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 25: టీడీపీ కూటమి అభ్యర్థులకు యాదవుల మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, ప్రధాన కార్యదర్శి చినరాజులు చెప్పారు. గురువారం స్థానిక గంగనపల్లెలోని అఖిల భారత యాదవ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నేతలు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే యాదవులకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. వైసీపీ ప్రభుత్వం యాదవులకు చేసిందేమీ లేదన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుల గెలుపునకు కృషిచేస్తామని చెప్పారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు అశోక్ ఆనంద్ యాదవ్, వెంకటేష్ యాదవ్, గుడిపాల బాలాజి, చిట్టిబాబు, నాగరాజ యాదవ్, పయణి యాదవ్, దాము యాదవ్, గౌతం యాదవ్, నర్సింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ కోరారు. గురువారం నగరంలోని 28వ డివిజన్ వినాయకపురం, 29 డివిజన్ రెడ్‌క్రాస్, అబ్దుల్ కలాం వీధి, మెసానికల్ గ్రౌండ్ వీధి, మిట్టూరు తదితర ప్రాంతాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిమ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మళ్ళీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు వైవీ రాజేశ్వరి, నాగరాజు, చిట్టిబాబు, రామమూర్తి, రాణి, వరలక్ష్మి, నరేష్, వినోద్, అత్తు, షణ్ముగం, గిరి, రేవతి, అను, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నగరిని దోచుకున్న రోజాను ఇంటికి సాగనంపండి : భాను



నగరి మండలం గుండ్రాజుకుప్పంలో భానుప్రకాష్ ప్రచారం

నగరి ఏప్రిల్25: నగరిని నిలువునా దోచేసిన మంత్రి రోజాను ఇంటికి సాగనంపాలని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. నగరి మండల పరిధిలో గురువారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 9గంటలకు మాంగాడు నుంచి ప్రారంభమైన ప్రచారం రాత్రి 10 గంటలకు ముడిపల్లి రామాపురంతో ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా అండ్ కో మట్టి, గ్రావెల్, ఇసుకను తమిళనాడుకు తరలించి కోట్లాది రూపాయలు పోగేసుకున్నారన్నారు. ప్రజలంతా అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి పాటు పడే తెలుగుదేశం పార్టీకి ఓటేసి తనను గెలిపించాలని కోరారు. అలాగే నగరిలోని 25, 26 వ వార్డులలో నగరి పట్టణ టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలను గురించి వివరిస్తూ ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాదరావును, ఎంఎల్ఏ అభ్యర్థి భానుప్రకాష్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతినాయుడు, గుణశేఖర్, ఖాదర్ భాయ్, బాలాజీ, శ్రీధర్, బాబురెడ్డి, మదన్‌కుమార్, టీఎన్‌టీయూసీ కుమార్, శ్రీనివాసులు, మణికంతం, పాలేగారు వెంకటరమణ, భీమా, బాలాజీ, చంద్ర,భరత్, గోపీనాథ్, సోము, మణి, అశోక్, రమేష్‌రెడ్డి, కృష్ణవేణి, మీరా, దుర్గా, వాసంతి బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వడమాలపేట : మండలంలోని ఎస్వీపురం ఉపసర్పంచ్ నాగమణి తన అనుచరులతో తిరుపతిలోని గాలి భానుప్రకాష్ నివాసంలో టీడీపీలో చేరారు. అలాగే పత్తిపుత్తూరు పంచాయతీ అమ్మగుంటలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మునిరత్నం ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోంది

పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు





ఆర్వోకి నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఎంఎస్ బాబు, నారపరాజుకండ్రిగలో రాకేష్‌రెడ్డి ప్రచారం, ఈదువారిపల్లెలో రమేష్‌బాబు ప్రచారం

పూతలపట్టు, ఏప్రిల్ 25: రాష్ట్రంలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని, ఆ పార్టీ గాలి వీస్తోందని ఆ పార్టీ పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు అన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ఆయన రంగంపేట క్రాస్‌రోడ్డు సమీపాన గల ఫ్లైఓవర్ నుంచి సుమారు ఐదువేల మంది కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారి పూతలపట్టుతోపాటు మరో 14 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. అనంతరం కార్యకర్తలు క్రేన్ ద్వారా ఆయనకు గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి ఎం. జగపతి, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీప్రసన్న కుమార్, రాష్ట్ర కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్, తవణంపల్లి మాజీ ఎంపీపీ రవిప్రసాద్, నాయకులు దీన, ప్రవీణ్‌కుమార్, చెన్నకేశవులు, విక్టోరియా, రాణెమ్మ, కవిత, తేజోవతి, కుమారి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పరిపాలనకు స్వస్తి పలకాలి : కాంగ్రెస్

విజయపురం : నిరంకుశ పరిపాలనకు స్వస్తి పలకాలని నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పాతార్కాడు, గొల్లపల్లి, మహారాజపురం, జంబాడ, ఇళ్ళత్తూరు, నారపరాజుకండ్రిగ గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ ఆదరించాలని కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రాజు, నాయకులు చిరంజీవిరెడ్డి, బాబు, డిల్లీ, రత్నం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

కార్వేటినగరం : కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదువారిపల్లెలో జీడీనెల్లూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డి.రమేష్‌బాబు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దినకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో 12 మంది నామినేషన్

వారంరోజుల్లో 42 నామినేషన్లు



ఆర్వోకి నామినేషన్ అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌బాబు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 25: గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి గురువారం 12 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ తెలిపారు. ఏడవరోజు గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వడింగాడు మునస్వామి థామస్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కళత్తూరు కృపాలక్ష్మి, ఆల్‌ఇండియా మహిళ ఎంపవర్‌మెంట్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సి.మురళి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డి.రమేష్‌బాబు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టి.డి.దేవరాజ్, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా భాస్కర్, విడుతలైచిరుతైగల్ కచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా పి.ఏసు, సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పళ్ళిపట్టు గుణశేఖర్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పచ్చికాపల్లం రవికుమార్, కరుణశ్రీ, కృపావతి నామినేషన్‌లు దాఖలు చేశారని ఆర్వో చెప్పారు.

34మంది అభ్యర్థులు 42 నామినేషన్లు

గంగాధరనెల్లూరు ఎస్సీ నియోజకవర్గ స్థానానికి ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేది వరకు 34మంది అభ్యర్థులు 42 నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికలు అధికారులు పేర్కొన్నారు. ఈనెల 18వ తేదిన ఇద్దరు అభ్యర్థులు రెండు నామినేషన్లు, 19న ఇద్దరు అభ్యర్థులు మూడు నామినేషన్లు, 20న ఇద్దరు అభ్యర్థులు మూడు నామినేషన్లు, 22న నలుగురు అభ్యర్థులు నాలుగు నామినేషన్లు, 23న ముగ్గురు అభ్యర్థులు మూడు నామినేషన్లు, 24న తొమ్మిది మంది అభ్యర్థులు 12 నామినేషన్లు, 25న 12 మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. కాగా అభ్యర్థులు కొందరు వివిధ రోజుల్లో అదనపు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా జీవీ వెంకటేష్

పూతలపట్టు, ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన జీవీ వెంకటేష్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నియమించారు.తవణంపల్లి మండలం జి.గొల్లపల్లికి చెందిన జీవీ వెంకటేష్ గతంలో జడ్పీటీసీగా పనిచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 25: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామానికి చెందిన సురేష్(29) పళ్లిపట్టు నుంచి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో నెలవాయి వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై కారు ఎదురుగా ఢీకొనడంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కమిషనర్



కార్వేటినగరం, ఏప్రిల్ 25: కార్వేటినగరం ఎక్సైజ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్‌ను గురువారం ఆ శాఖ రాయలసీమ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా విధులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు అందజేశారు. ఎన్నికల తరుణంలో విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చిత్తూరు, ఏప్రిల్ 25: నగరంలో నీటి సమస్య పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అరుణ చెప్పారు. గురువారం వినాయకపురం పరిధిలో నీటి సరఫరాను పరిశీలించారు. రెండు బోర్లలో నీళ్లు తగ్గిపోవడంతో అవసరాలకు తగినంత గా రావడం లేదని కమిషనర్‌కు చెప్పారు. నీటి కొరత తలెత్తకుండా అవసరాలకు తగినంతగా అదనపు ట్రిప్పులను పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిత్తూరు, ఏప్రిల్ 25: వినాయకపురం పరిధి ప్రాథమిక పాఠశాలలోని 94, 95 పోలింగ్ కేంద్రాలను గురువారం ఏఆర్వో, కమిషనర్ అరుణ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సౌకర్యాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఎన్నికల అధికారుల ఫోన్ నెంబర్లు ఉన్నాయా అని నోటీసు బోర్డులో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌లో అనిల్‌కుమార్‌నాయక్, డీఈ వెంకట ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడిని కలిసిన కలెక్టర్ షన్మోహన్



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25: కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జనరల్ అబ్జర్వర్ ఎండీ షాదిక్ అలామ్ గురువారం చిత్తూరుకు చేరుకున్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో బస చేసిన పరిశీలకుడిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. కేంద్ర ఎన్నికల సంఘం జనరల్ అబ్జర్వర్‌గా షాదిక్ అలామ్‌ను చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించిన విషయం తెలిసిందే.

మలేరియాపై అవగాహన ర్యాలీ

పాలసముద్రం, ఏప్రిల్ 25: మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాలసముద్రం పీహెచ్‌సీ నుంచి బీసీ కాలనీ వరకు ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహనకృష్ణ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నిండ్ర : మలేరియా అవగాహన ర్యాలీలో నిండ్రలో వైద్యాధికారులు సుమలత, వినీషా మాట్లాడుతూ రెండు రోజులకు మించి జ్వరం ఉన్నట్లయితే తప్పనిసరిగా రక్తపరీక్షల చేసుకుని నిర్ధారించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ పట్టాభిషేకం



గుడిపాల, ఏప్రిల్ 25: మండలంలోని బసవాపల్లి పంచాయతీ కోలావూరులో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారామ పట్టాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాముడి పట్టాభిషేకాన్ని పురోహితులు మహేష్ శర్మ, సుదర్శన్‌లు రమణీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, శాస్త్రవేత్త చిన్నబ్బ నాయుడు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

సారా తయారీదారుల అరెస్టు



పాలసముద్రం, ఏప్రిల్ 25: తమిళనాడు సరిహద్దు గ్రామమైన నరసింహాపురంలో సారా తయారీ చేస్తున్న భార్యభర్తలు జీవ, అల్లిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ భారతి తెలిపారు. 'సరిహద్దు గ్రామాల్లో నాటు ఘాటు' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో వార్తాకథనం ప్రచురితం కావడంతో పోలీసులు స్పందించి సారా స్థావరాలపై దాడులు చేశారు. అరెస్టు అయిన వారివద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేత



విజయపురం, ఏప్రిల్ 25: నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో ఆయన స్వగృహం తిరుపతిలో గురువారం జగన్నాథపురానికి చెందిన వైసీపీ నాయకుడు ప్రకాష్‌యాదవ్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు రవీంద్రవర్మ, నాయకులు ప్రణీత్‌నాయుడు, నరేంద్రవర్మ, యుగందర్‌వర్మ, మురళీనాయుడు, ఏకుమలై పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడికి ఫిర్యాదు ఇలా..

వెదురుకుప్పం, ఏప్రిల్ 25: ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై పరిశీలకుడికి ఫిర్యాదు చేయాలని యంత్రాంగం గురువారం ప్రకటించింది. చిత్తూరు పార్లమెంటరీ పరిధిలోని చంద్రగిరి, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకుడిగా ఉన్న కైలాస్ వాంఖడేకు సెల్‌ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చునని తెలియజేశారు. పరిశీలకుడి నంబరు 09281448305గా పేర్కొన్నారు. ఈ మేరకు యంత్రాంగం ప్రకటన విడుదల చేసింది.

కేఈసీలో రేపు మెగా జాబ్ మేళా

కుప్పం, ఏప్రిల్ 25: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, కుప్పం డిగ్రీ కళాశాలలో కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ, బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు తెలిపారు. ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9603929625, 6303912518, 9542423396 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.